క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన పుడా చైర్‌పర్సన్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పుడా చైర్‌పర్సన్

పుట్టపర్తి అర్బన్: నూతన జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబును పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఆమెతో పాటు భర్త, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగాద్రి ఉన్నారు.
• సత్యసాయి మహాసమాధిని కలెక్టర్ దర్శించుకున్నారు. శాంతిభవన్‌లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌తో కొంతసేపు ముచ్చటించారు.

అన్నదానం

అమడగూరు: చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా జ్యోతిని పురస్కరించుకుని సోమవారం చీకిరేవులపల్లి యూత్ ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం పక్కనే ఉన్న చౌడేశ్వరీ కల్యాణ మండం వద్ద 10 కౌంటర్లను ఏర్పాటు చేసి భక్తులందరికీ అన్నదానం చేశారు. సుమారు 20 వేల మంది భోజనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు యువకులను అభినందించారు.

మద్యం విక్రేత అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లిలో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన నిజమాల ప్రసాద్ అనే వ్యక్తి గ్రామంలో కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. ఆయన కొంత కాలంగా మద్యం విక్రయిస్తున్నట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ సిబ్బందితో కలసి అతని ఇంటిలో సోదాలు చేయగా 11 క్వీన్స్‌వెల్ బ్రాందీ 180 ఎంఎల్ బాటిళ్లు లభించాయి. దీంతో అతనిపై కేసు నమోదు చేసుకుని కోర్టుకు హాజరుపర్చగా జడ్జీ ముద్దాయికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నియామక పత్రాల అందజేత

తనకల్లు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు ఎంపికైన వారికి సోమవారం తవళం సర్పంచ్ శ్రీనివాసులు, ఈఓఆర్డీ ఆనందయ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ ఆనందయ్య మాట్లాడుతూ తవళం, డీటీ పల్లి, టీ.సదుం గ్రామాలలో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ల పోస్టులకు ఇటీవల ఇంటర్వ్యూలను నిర్వహించామన్నారు. అన్ని అర్హతలున్న అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

పరామర్శ



వాల్మీకి శంకర్‌ను పరామర్శిస్తున్న దుద్దుకుంట వెంకటరామిరెడ్డి

కొత్తచెరువు: కొత్తచెరువులో సోమవారం పలువురిని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తండ్రి దుద్దుకుంట వెంకటరామిరెడ్డి పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వలి కుమారుడు ఖలందర్ మృతదేహానికి నివాళులర్పించారు. సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డె పెద్ద మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వాల్మీకి శంకర్‌ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మటన్‌వంకర్, పేయిటర్ గిరి, పెయింటర్ కేశవ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం



పద్మకు నియామక పత్రం అందిస్తున్న తహసీల్దార్ యుగేశ్వరి దేవి

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీఆర్ఏ సాకే గంగప్ప భార్య పద్మకు కారుణ్య నియామక పత్రాలను సోమవారం తహసీల్దార్ యుగేశ్వరిదేవి అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, వీఆర్ఓ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సమావేశానికి హాజరైన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వాసవీ కల్యాణమండపం ఆవరణలో నిర్వహించిన మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఖాతాల్లో రూ.లక్షలు జమ చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా మూడు విడతలలో రూ. 31,73,53,662 ప్రభుత్వం మహిళలకు అందజేసిందన్నారు. పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. నమ్మకమే పెట్టుబడిగా మహిళలకు బ్యాంకులలో రుణాలు ఇచ్చారని వాటిని సకాలంలో చెల్లించి మళ్లీ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఏ సంక్షేమ పథకమైనా పొందాలంటే రూపాయి లంచం అడిగారా? అని ఎమ్మెల్యే మహిళలను ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఏదైనా ప్రభుత్వ పథకం పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులకు సొమ్ము ఇచ్చుకోవాల్సి వచ్చేదన్నారు. అమ్మఒడి, పింఛన్లు, మహిళా రుణాలు, జగనన్న తోడు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పథకాలు ప్రజలకు ఇస్తుంటే సోమరిపోతులను చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. తీరా ఎన్నికలు వచ్చాక తాము కూడా ఈ పథకాలు అమలు చేస్తామని మోసపూరిత మాటలు ఓట్ల కోసం చెబుతున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో బ్యాంకులలో ఉన్న మహిళ బంగారాన్ని అంతా విడిపిస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని మోసపూరిత మాటలు చెప్పి 2014లో గెలిచి రుణమాఫీ చేయకుండా చంద్రబాబు మోసం చేశారన్నారు. అక్కాచెల్లెమ్మల బంగారం బ్యాంకులలోనే నిలిచిపోయిందని, పావలా వడ్డీ పడాల్సిన రుణాలకు రూ.2 చెల్లించాల్సి వచ్చిందన్నారు. టీడీపీ హయాంలో మరుగుదొడ్లు, నీరు చెట్టు కింద కోట్లాది రూపాయలను దోచుకున్న ఘనత టీడీపీ నాయకులకే దక్కిందని దుయ్యబట్టారు. ఈ స్కాంలో 26 మంది జైలుకు కూడా పోయారన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక మంచి వర్షాలు కురిసి మంచి దిగుబడి వస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏరియా కోఆర్డినేటర్ రమణప్ప, జెడ్పీటీసీ తిరుమలబాయి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, వైస్ ఎంపీపీ క్రిష్ణమ్మ, ఏపీఎం హేమలత, మహిళా సంఘం నాయకురాలు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడిమర్రిలో..

తాడిమర్రి: స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా మంగళవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, ఏపీఎం సాంబశివుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసరా పథకం ద్వారా మహిళలకు మెగా చెక్కును పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సావిత్రమ్మ హాజరవుతారన్నారు. వైస్ ఎంపీపీలు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం



సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

• ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

తలుపుల: అన్నివర్గాల వారికి న్యాయం చేయడం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. మండల కేంద్రం తలుపుల–1 సచివాలయ పరిధిలోని సంగం బజార్, బలిజపేటలో సోమవారం వారు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్తులు పలు సమస్యలను వివరించగా, వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఏరాష్ట్రంలో చేపట్టనటువంటి సంక్షేమ పథకాలు సీఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా భావించి అమలు పరుస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా బలపడేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వీటన్నిటినీ చూడలేని చంద్రబాబు నాయుడు, దుష్ట చతుష్టయం ప్రభుత్వంపై బురద చల్లే కార్యక్రమం చేపడుతున్నారని దుయ్యబట్టారు. వీటిని ప్రజలే తిప్పికొట్టాలన్నారు. అనంతరం మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్లు అతికించి టోల్ ఫ్రీ నంబర్‌కు మిస్‌డ్ కాల్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫినాయక్, సర్పంచ్ శ్రీలత, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి క్రిష్ణారెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కులశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సూర్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, పయాజ్ అహమ్మద్, సర్పంచ్‌లు షేక్షావలి,శ్రీరామ్‌రెడ్డి, పెద్దినాయుడు, సుదర్శన్‌రెడ్డి, వెంకటపతినాయుడు, జేఏసీ కన్వీనర్ టోపీరమణ, వివేకానందరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మౌలా, రమేష్, హరి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున, హౌసింగ్ డీఈ మునీశ్వర్‌నాయుడు

ధర్మవరం: ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, హౌసింగ్ డీఈ మునీశ్వర్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సచివాలయాల అమ్యూనిటీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రారంభ దశ నుంచి ఇప్పటి వరకు ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు ఎప్పటికప్పుడు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. అమ్యూనిటీ కార్యదర్శుల ద్వారా లేఅవుట్‌లో నీటి కొరత ఉందన్న సమస్య రాగా తక్షణమే ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఆ సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. పట్టణంలో మొత్తం 11,494 ఇళ్లు మంజూరు కాగా అందులో 3,432 పునాదులు, 4,993 గోడలు, 418 ఇళ్లు, టాపు పూర్తి అయిన ఇళ్లు 154, ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని ఇళ్లలో చేరినవారు 1,262 మంది ఉన్నారని వివరించారు. ఇక నుంచి త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని ఇందుకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకుని రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాలాజి, సచివాలయాల అమ్యూనిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్'



చౌటకుంటపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



ఎస్.కె.తండాలో ప్రభుత్వ పనితీరును తెలుసుకుంటున్న గృహసారథులు, నాయకులు



గరిశలపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ కోటి సుధ, ఎంపీపీ వెంగళరెడ్డి

తనకల్లు: మండలం లోని తవళం, కోటపల్లి, తనకల్లు–1,2,3, ఈతోడు, కొర్తికోట గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాలలో సోమవారం ఇంటింటా జగనన్నే మా భవిష్యత్ పెద్ద ఎత్తున చేపట్టారు. వైఎస్సార్ సీసీ నాయకులు, గ్రామసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అంటించి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు హేమశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, రవి తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన

నల్లమాడ: 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి మండలంలో విశేష స్పందన లభిస్తోంది. చౌటకుంటపల్లి, దొన్నికోట, గోపేపల్లి, మూలప్పగారిపల్లి, యర్రవంకపల్లి, రెడ్డిపల్లి, నల్లమాడ తదితర గ్రామాల్లో గృహ సారథులు, వలంటీర్లు, నాయకులు గడప గడపకూ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వారి అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అతికిస్తున్నారు.

సందడిగా..

ఎన్పీకుంట: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సందడిగా నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని వెలిచలమల, ఎదురుదోన, పి కొత్తపల్లి, అల్లుగుంటివారిపల్లి, ఎస్.కె. తండా గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో గృహసారథులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, నాయకులు ఈశ్వర్‌నాయక్, గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు మండలంలో..

అమడగూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నే మన భవిష్యత్తు అని నాయకులు పేర్కొన్నారు. సోమవారం అన్ని పంచాయతీల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవిత, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్ల, చింతమానుపల్లి, టీ.కుంట్లపల్లి, ఇనగలూరు, వెంకటాపురం గ్రామాల పరిధిలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ముఖ్యమంత్రి పాలనపై రూపొందించిన ప్రశ్నావళికి మహిళల నుంచి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రావణి, శ్రీదేవి, జగన్‌మోహన్ చౌదరి, గ్రామ కన్వీనర్లు వెంకటనారాయణ, నాయకులు సుబ్బిరెడ్డి, రమణ, జగన్నాథరెడ్డి, చెన్నారెడ్డి,చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్‌లో..

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నాగలూరు, గొట్లూరు, ఏలుకుంట్ల, తనకంటువారిపల్లి, పోతులనాగేపల్లి, రేగాటిపల్లిలో మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు భయం

బత్తలపల్లి: 'మా నమ్మకం నువ్వే జగన్' అనేది ప్రజల నినాదమని, ఈ కార్యక్రమంతో ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గరిశలపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని సర్పంచు పద్మావతితో కలిసి నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్ రమణారెడ్డి, నాయకులు చెన్నారెడ్డి, నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంతోనే సమర్థ పాలన

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంతోనే సమర్థపాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి తెలిపారు. సోమవారం న్యామద్దలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ కేశన్న, నాయకులు భాస్కర్, నారాయణ స్వామి, కిష్టప్ప, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా..

నల్లచెరువు: రాజమొల్లపల్లి తాండాలో పంచాయతీ రాజ్ జోనల్ ఇంచార్జ్ కె.రమణారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జేసీఎస్ కన్వనర్ రాజశేఖర్,వలంటీర్లు,గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లిలో..

పోగొట్టుకున్న నగదు అప్పగింత



ప్రయాణికుడికి నగదు, క్రెడిట్‌కార్డు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం డిపో ఆర్టీసీ బస్సులో డబ్బు పోగొట్టుకున్న ఓ ప్రయాణికుడికి ఆర్టీసీ అధికారులు తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేషులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరం ఆర్టీసీ డిపోనకు చెందిన ఏపీ16జడ్ 0455 నంబరు బస్సు సోమవారం అనంతపురం నుంచి ధర్మవరానికి బయలుదేరింది. ధర్మవరం ఎల్ఐసీ ఆఫీస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సూరిబాబు అనంతపురంలో ధర్మవరం డిపో బస్సు ఎక్కాడు. బస్సు ధర్మవరానికి చేరుకోగానే ఆ ప్రయాణికుడు బస్సులో క్రెడిట్‌కార్డుతోపాటు రూ.10,500 నగదు పోగొట్టుకున్నాడు. అనంతపురానికి చెందిన కానిస్టేబుళ్లు గంగాధర్, రామలింగంకు బస్సులో పడిపోయిన క్రెడిట్‌కార్డు, నగదు దొరికాయి. కానిస్టేబుళ్లు ధర్మవరం డిపోలోనున్న ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు చేతికి అందించారు. వెంటనే క్రెడిట్ కార్డు ఆధారంగా ప్రయాణికుడికి సమాచారం అందించగా డిపో వద్దకు ఆయన చేరుకున్నాడు. డబ్బు, క్రెడిట్‌కార్డులను ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, సూపరింటిండెంట్ ప్రేమ్‌కుమార్, అకౌంటెంట్ ఓబిలేసు, సీనియర్ అకౌంటెంట్ దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌లు ప్రయాణికుడికి అందించారు.

ఇఫ్తార్ విందు



కోటి సూర్యప్రకాష్ బాబును సన్మానిస్తున్న ముస్లింలు

బత్తలపల్లి: బత్తలపల్లిలోని జామియా మసీదులో సోమవారం ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందులో కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు.

మే 13న లోక్ అదాలత్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోర్టులో మే 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గం ద్వారా సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించనున్నామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం..

నల్లచెరువు: మండలంలోని మద్దేపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీపీ కె.రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కదిరి టౌన్: కదిరి పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే సర్కిల్‌లో మంగళవారం పూలే జయంతి నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరవుతారు. విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేడు రాశింపల్లిలో..

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం రాశింపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం



జ్యోతులతో వెళ్తున్న మహిళలు

కనగానపల్లి: మండల కేంద్రంలో సోమవారం అంజనేయస్వామికి జ్యోతుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి ఆకుపూజ చేయించి అలంకరించారు. సాయంత్రం మహిళలు, యువతులు జ్యోతులు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి స్వామికి సమర్పించారు. మంగళవారం గ్రామంలో పోతలయ్యస్వామికి బోనాల పండుగ చేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

బత్తలపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2023–24 సంవత్సరానికి పండ్ల తోటల పెంపకానికి అర్హత, ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని బత్తలపల్లి ఏపీఓ కుందానం ఆదెప్ప పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతు సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. మామిడి, చీనీ, నిమ్మ, దానిమ్మ, జామ, డ్రాగన్‌ఫ్రూట్, సీతాఫల్ మొక్కలు కావాల్సిన రైతులు ఈ నెల 20వ తేదీలోపు సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్, ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ, ఈసీని సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

అమడగూరు: ఏ కొత్తపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పొట్టా రాఘవరెడ్డి (52) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. రాఘవరెడ్డి సోదరుడు శివశంకర్ రెడ్డి ఇరిగేషన్ ఈఈగా పని చేస్తూ ఏడాది క్రితమే మృతి చెందాడు. సోదరులిద్దరూ ఏడాది వ్యవధిలోనే మృతి చెందడంతో గ్రామస్తులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ కవిత, శివశంకర్‌రెడ్డితో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు గ్రామానికి వెళ్లి సంతాపం తెలియజేశారు.

ఆస్పత్రిలో వసతులపై ఆరా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులపై డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వి సాల్మన్ సోమవారం ఆరా తీశారు. కరోనా దృష్ట్యా బెడ్లు, ఆక్సిజన్, వెంటిలేటర్లు, డాక్టర్లు, నర్సులు, మందులు, ఆయుష్ డాక్టర్లు, టెస్టింగ్ కెపాసిటీ మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూపరింటెండెంట్ పద్మలతకు సూచించారు. ఫార్మసిస్ట్ భాస్కర్, సూపర్‌వైజర్ లక్ష్మినారాయణ తదితరులున్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించండి

బత్తలపల్లి: 'స్పందన'లో అందే ప్రజా సమస్యలను గడువులోగా పరిష్కరించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవీ పేర్కొన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో ఆరు అర్జీలు అందినట్లు తెలిపారు.

ఘనంగా అక్కమ్మ దేవతల జాతర

తాడిమర్రి: పిన్నదరి సమీపంలో కొండపై వెలసిన అక్కదేవతల జాతర సోమవారం వైభవంగా జరిగింది. అర్చకులు అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ దిగువన ఉన్న ఆలయంలో విగ్రహాలకు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించారు. బీరప్ప, అటలప్ప స్వాములకు కూడా ఆయా గుడికట్టు దారులు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించి అక్కదేవతల పక్కన కొలువుదీర్చారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు పొరాళ్ల లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కదిరి అర్బన్: సున్నపుగుట్టతండాలోని సీపీఐ కాలనీలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆదేశాల మేరకు గ్రామసర్పంచ్ శాంతాబాయ్ నూతన బోరు మోటారు బిగించి నీటి సమస్య పరిష్కరించారు. గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అల్లాబక్షు, రామచంద్ర, శీనా తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సన్మానం

ధర్మవరం: తిరుపతి నగరంలో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక చంద్రాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలలో ధర్మవరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు మల్లికార్జున కవితా గానం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేకమంది కవులు, కళాకారులు పాల్గొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కత్తిమండ ప్రతాప్, ఇంద్రలు మల్లికార్జున కవితాగానంను ప్రశంసించి శాలువాలతో సన్మానించారు.

రైతు ఉత్పత్తిదారు సమాఖ్య ఏర్పాటు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో నూతనంగా రైతు ఉత్పత్తిదారు సమాఖ్యను ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించి 15 మంది సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంఎల్‌హెచ్ రామ్మోహన్ తదితరులున్నారు.